

సొంత జిల్లాకు రానున్న తహసీల్దార్లు

కలెక్టరేట్, జూలై 19: సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు వెనక్కి రానున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం శుక్రవారం మెమో జారీ చేసింది. దీనిపై సీసీఎల్‌ఏ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. సాధారణ ఎన్నికల కోసం జిల్లాలోని ఐదారుగురు తహసీల్దార్లు మినహా మిగిలిన వారిని శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్టణం, అనకాపల్లి జిల్లాలకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. సీసీఎల్‌ఏ ఆదేశాలు వచ్చిన తరువాత వారంతా సొంత జిల్లాకు రానున్నారు. ఇక్కడకు వచ్చిన తరువాత కలెక్టర్ ఆదేశాల మేరకు వారికి మండలాలను కేటాయించనున్నారు.


పూసపాటిరేగ: పాతకొప్పెర్ల వద్ద హైవేపై నిలిచిపోయిన వర్షపునీరు


రాజాం: శ్రీకాకుళం రోడ్‌లో పొలాల్లో చేరిన నీరు


గజపతినగరం-ఆంధ్ర రోడ్డులో..


ఎస్.కోట:వెంకటరమణపేటలో దమ్ములు చేస్తున్న దృశ్యం


రేగిడి: సంకిలి వద్ద నాగావళి పరవళ్లు

జోరువాన

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- నేడు కూడా కురిసే అవకాశం
- నాగావళిలో పెరిగిన నీటిమట్టం
- లోతట్టు గ్రామాలకు వరద ముప్పు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), రేగిడి/పూసపాటిరేగ, రాజాం/శృంగవరపుకోట, జూలై 19: జిల్లా వ్యాప్తంగా జోరువానలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వానలు పడ్డాయి. పూసపాటిరేగ మండలంలో అత్యధికంగా 156.8 మిల్లీ మీటర్లు, బొబ్బిలి మండలంలో అత్యల్పంగా 12.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాల కారణంగా పూసపాటిరేగ మండలం కోనాడ జంక్షన్ నుంచి పాతకొప్పెర్లకు వెళ్లే జాతీయ రహదారి సర్వీస్ రోడ్‌పై వరద నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాగావళిలో నీటిమట్టం పెరుగుతుండడంతో రేగిడి మండలంలోని నదీ తీరంలో ఉన్న 12 లోతట్టు గ్రామాలకు వరదభయం పట్టుకుంది. సాయన్న చానల్, అకలోవకట్ట గెడ్డ పోటెత్తి ప్రవహిస్తున్నాయి. మరో రెండు రోజులు వానలు కురిస్తే రేగిడి, బొడ్డవలస, పుర్లి, వెంకటాపురం, ఖండ్యాం, పాతచెలిగానవలస, కొమిర తదితర గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉండే అవకాశం ఉంది.

నది ఒడ్డున ఉన్న బొడ్డవలస, పుర్లి గ్రామాల వద్ద వరదలకు రక్షణగా వేసిన కరకట్టు మధ్యలో ఉండిపోవటం పెద్ద ప్రమాదంగా ఉందని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక సెల్‌ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ఈ నెల 20 వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ అంబేడ్కర్ శుక్రవారం అన్ని మండలాల తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారులు పునరుద్ధరించారు. జిల్లా కేంద్రం విజయనగరంలోని పలు రహదారులపై వర్షపునీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గజపతినగరంలో రోడ్లపైకి భారీగా నీరు చేరింది. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.



ముందుకొచ్చిన సముద్రం

భోగాపురం: అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం ముక్కాం తీరంలో సముద్రం ముందుకొచ్చింది. సుమారు 70 అడుగుల మేర ముందుకొచ్చి ఉధృతంగా కెరటాలు తీరాన్ని తాకుతున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం లేదు. పడవలు, వలలు, ఇంజన్లను భద్రపరచుకోవడానికి ఎటువంటి రక్షణ భవనాలు లేకపోవడంతో వర్షంలోనే వాటిని ఉంచారు. దీంతో అవి పాడైపోతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. తీరంలో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో శనివారం జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు కలెక్టర్ అంబేడ్కర్ సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


ముక్కాం తీరంలో ముందుకొచ్చిన సముద్రం, ఒడ్డుకు చేర్చిన పడవలు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- వాహనాలను వెంటనే సీజ్ చేయాలి
- కలెక్టర్ అంబేడ్కర్
- పోలీసుశాఖపై ఆగ్రహం

కలెక్టరేట్, జూలై 19: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు కేసులు పెడుతున్నప్పటికీ పోలీసు శాఖ చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులంతా క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. రీచ్‌ల వద్ద వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మైన్స్ డీడీని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, మైన్స్, రవాణా శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా ను అడ్డుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ట్రాక్టర్లతో ఇసుక అమ్మకుండా చూడవల్సిన బాధ్యత వీఆర్వోలేదనని స్పష్టం చేశారు. ఒక గ్రామం నుంచి మరోక గ్రామానికి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఆర్డీవో సూర్యకళ, శాంతి, సాయిశ్రీ, అదనపు ఎస్పీ అసమా పర్వీన్ , పీసీబీ డీడీ సరిత, మైన్స్ డీడీ సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఏపీఐఐసీ భూములపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

ఏపీఐఐసీకి కేటాయించిన భూములపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. క్లియర్‌గా ఉన్న భూములను ఏపీఐఐసీకి అప్పగించాలని, మిగిలిన భూముల వివరాలు, ప్రస్తుతం వాటి స్టేటస్‌ను తెలుపుతూ వారం రోజుల్లో నివేదిక అందించాలన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీఐఐసీకి కేటాయించిన 250 ఎకరాల భూములను ఏ విధంగా అభివృద్ధి చేసిందీ, ఎలాంటి చర్యలు తీసుకున్నది ఆ శాఖ అధికారులను అడిగారు. భూములు రివైజ్డ్ రేట్లను తెలియజేస్తూ ఏపీఐఐసీకి లేఖ రాయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. భూములు ఇచ్చే పరిస్థితి లేని చోట వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని తెలిపారు.

అనుబంధ రంగాలు నిర్వీర్యం

- మొక్కుబడిగా మార్కెటింగ్, సహకార శాఖలు
- గత ఐదేళ్లలో గాడి తప్పిన వైనం
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

రాజాం, జూలై 19: వ్యవసాయ అనుబంధ రంగాల్లో మార్కెటింగ్ శాఖ కీలకం. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఆర్థిక పరిపుష్టితో కళకళలాడేవి. నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, పూసపాటిరేగ, కొత్తవలస, రాజాంలో మార్కెట్ కమిటీ కార్యాలయాలు(ఏఎంసీ) ఉన్నాయి. వీటికి గతంలో మాదిరిగా ఆదాయ వనరులు లేవు. గోదాములను వినియోగించే పౌరసరఫరాల శాఖ, గృహనిర్మాణ శాఖ అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు. ఆ రెండు శాఖలే సుమారు రూ.2 కోట్లు బకాయిలు పడినట్టు తెలుస్తోంది. దీంతో మార్కెట్ శాఖలో ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. గత ఐదు సంవత్సరాల్లో జిల్లాలో మార్కెటింగ్ శాఖకు సెస్ రూపంలో రూ.50 కోట్ల ఆదాయం సమకూరింది. గోదాముల అద్దె రూపంలో మరికొంత ఆదాయం వచ్చింది. అయితే ఆ ఆదాయంలో నేరుగా 45 శాతం ప్రభుత్వానికి జమ అవుతోంది. దీనివల్ల మార్కెటింగ్ శాఖ సిబ్బందికి సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. ఇటు రైతుల కోసం ఏ కార్యక్రమం చేపట్టిన పరిస్థితి లేదు.

- జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదాలపై చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆయా చోట్ల ఈ-పర్మిట్ ద్వారా సెస్ వసూలు చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సమయంలో వాటి ధరలో ఒక శాతం సెస్‌ను వసూలు చేస్తారు. ఒక విధంగా చెప్పాలంటే ఏఎంసీలకు ఇదే ప్రధాన ఆదాయ వనరు. కానీ అక్కడున్న సిబ్బంది చేతవాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఏఎంసీలు వసూలుచేసే సెస్‌తో సీజన్ల వారీగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. సెస్ ఆదాయం నేరుగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు జమ అవుతోంది. తిరిగి నిధులు మంజూరు కావడం లేదు.

> జిల్లాలో వ్యవసాయాధారితం. ఎక్కువ మంది సాగుపై ఆధారపడి బతుకుతున్నారు. అయినా ఈ రంగంలో సంతృప్తికరమైన ఆదాయం పొందే పరిస్థితి లేదు. కనీసం అనుబంధ రంగాలు పటిష్ఠంగా ఉన్నా మేలు చేకూరేది. కీలకమైన మార్కెటింగ్ శాఖ రైతుకు ఏమాత్రం భరోసాగా నిలవడం లేదు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలదీ అదే పరిస్థితి. గాడి తప్పిన ఈ రెండు రంగాలు మళ్లీ పూర్వ స్థితికి రావాలని, కూటమి ప్రభుత్వం ఆవైపుగా మార్పు తేవాలని రైతులు కోరుతున్నారు.

'సహకారం' సున్నా...

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతు సేవ కంటే వాణిజ్య ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయన్న విమర్శ ఉంది. ఉమ్మడి జిల్లాలో 95 పీఏసీఎస్‌లు ఉన్నాయి. చాలావాటికి సొంత భవనాలు కూడా లేవు. రైతులు పండించే పంటలను ధర వచ్చేవరకూ నిల్వ చేయడం వీటి ప్రధాన విధి. కానీ అటువంటిదేమీ జిల్లాలో కనిపించడం లేదు. జిల్లాలో చాలా చోట్ల గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో దాని నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించారు. మొత్తం రూ.23 కోట్ల అంచనా వ్యయంతో వీటి నిర్మాణాలు ప్రారంభించారు. కానీ ఎక్కడా పూర్తయిన దాఖలాలు లేవు. దీనికితోడు గత ఐదేళ్లగా రైతుభరోసా కేంద్రాల పేరు చెప్పి.. ప్రాథమిక వ్యవసాయ పరపతి సేవా సంఘాల సేవలను పూర్తిగా తొక్కిపెట్టారు. వ్యవసాయ, అనుబంధరంగాల పరిస్థితి ఇలా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైనే జిల్లా రైతులు ఆశలు పెట్టుకున్నారు.



రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ

రెఫర్ టు విజయనగరం

- స్థాయి పెరిగినా సేవలు పెరగలే
- రోగులను జిల్లా కేంద్రానికి పంపిస్తున్న వైనం
- స్కానింగ్ కోసం ప్రైవేట్ వైద్యశాలలకు తరలింపు
- మారని ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రి తీరు

శృంగవరపుకోట జూలై 19: ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రి స్థాయి పెరిగి ఏళ్లుగా గడుస్తున్నా వైద్య సేవలు మాత్రం పెరగడం లేదు. ఇక్కడకు వస్తున్న రోగులను పరీక్షించకుండానే విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రికి వైద్యులు రెఫర్ చేస్తున్నారు. ఇక్కడ కూడా సౌకర్యాలు లేవని చెప్పి విశాఖ కేజీహెచ్‌కు పంపిస్తున్నారు. దీనివల్ల చికిత్స అందడంలో ఆలస్యమై కొన్నిసార్లు రోగులు మృతిచెందుతున్నా రు. 50 పడకలతో ఉన్న ఎస్.కోట సామాజిక ఆస్పత్రిని 2019 ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ప్రాంతీయ ఆస్పత్రిగా మార్పు చేసింది. అయితే, ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టీడీపీ పెంచిన ఆస్పత్రి స్థాయిని కొంతకాలం పాటు తొక్కిపెట్టి తరువాత తామే ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయిని పెంచినట్లు జీవో తీసుకొచ్చింది. 100 పడకల ఆసుపత్రిగా మార్చుచేసి భవన నిర్మాణాలకు నిధులు కేటాయించింది. ఇంతవరకు బాగున్నప్పటికీ 2022 జనవరి నాటికి పూర్తికావాల్సిన భవనాలు ఇంకా పూర్తిచేయలేదు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలను ఆపేశాడు. ప్రస్తుతం సామాజిక ఆసుపత్రి భవనాల్లోనే రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఈ ఆస్పత్రికి నియోజకవర్గంలోని శృంగవరపుకోట, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస, జామి మండలాలతో పాటు గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, పక్కనున్న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, అనంతగిరి, డుంబ్రిగూడ గిరిజన మండలాల నుంచి ఎక్కువగా రోగులు వస్తుంటారు. నెలకు 8వేల నుంచి 10 వేల మంది వరకు వస్తున్నట్లు ఓపీ లెక్కలు చెబుతున్నాయి.

ఓపీకే పరిమితం..

ప్రాంతీయ ఆసుపత్రిగా మారడంతో ఇక్కడ అన్ని రకాల వ్యాధులకు వైద్యులను నియమించారు. ఇందుకు అనుగుణంగా సిబ్బంది పెరిగారు. శిక్షణ నిమిత్తం నర్సింగ్ విద్యార్థులు వస్తున్నారు. పరిపాలన విభాగానికి వైద్యేతర ఉద్యోగులు సైతం వచ్చారు. కానీ, ఇందుకు అనుగుణంగా సేవలు మాత్రం పెరగలేదు. కేవలం ఓపీకి మాత్రమే ఇక్కడ వైద్యులు పరిమితమయ్యారు. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి వాటికి మాత్రమే ఇక్కడ వైద్యం అందుతుంది. స్కానింగ్ యంత్రం ఉన్నప్పటికీ అందరికి ఉపయోగించరు. బయట చేయించుకురావాలని బహిరంగంగా వైద్యులు చెబుతారు. గర్భిణులకు కూడా మినహాయింపు లేదు. కొంతమంది వైద్యులైతే పలానా ప్రైవేటు ఆసుపత్రిలో స్కానింగ్ తీసుకోవాలని చెబుతున్నారు. గది తలుపులు మూయకుండానే రోగులకు ఎక్సరేలు తీస్తున్నారు. దీనిపై మిగిలిన రోగులపై రేడియోషన్ ప్రభావం పడుతుంది. నిబంధనలకు విరుద్ధంగా రోగులకు నర్సింగ్ విద్యార్థులతో ఇంజక్షన్‌లు ఇప్పిస్తున్నారు. ఆసుపత్రి భవనాలు పూర్తికాకపోవడంతో ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు కూర్చొంటున్నారు. వేర్వేరు విభాగాలకు చెందిన వైద్యులు కావడంతో వారికి చూపించుకొనేందుకు రోగులు ఈ గదివద్దే బారులు తీరాల్సి వస్తుంది. ఏ విభాగానికి చెందిన రోగి ఏ డాక్టరు వద్దకు వెళ్లాలో చేప్పేవారేవరూ లేరు.



చీటీ రాయించుకుని రావాల్సిందే..

ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఓపీ చీటీ రాయించుకురావాలని వైద్యులు చెబుతున్నారు. అయితే, ఓపీ విభాగం వద్ద 10 నిమిషాలకంటే ఎక్కువ సమయం పడుతుంది. దీంతో అత్యవసర రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి అత్యవసర రోగులకు క్యాజువాల్టీలో చికిత్స చేయాలి. ఓ వైపు చికిత్స చేస్తుండగా ఓపీ చీటీ పొందేందుకు అవకాశం ఇవ్వాలి. గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందిన మహిళలకు రక్తహీనత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి గర్భిణిలకు ప్రసవ సమయంలో రిస్కు ఉంటుంది. గతంలో సామాజిక ఆసుపత్రిగా ఉన్న సమయంలో అవసరమయ్యే వైద్యులు, పరికరాలు లేకపోవడంతో రిస్కు ఉన్న గర్భిణిలను అత్యవసర చికిత్స కోసం విజయనగరం ఘోసాసుపత్రికి తరలించేవారు. ప్రాంతీయ ఆసుపత్రిగా మారిన తరువాత కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నారు. చిన్నపాటి గాయాలు, ఇతర వ్యాధులకు చికిత్స కోసం వచ్చిన వారిని అత్యవసర వైద్యం పేరుతో విజయనగరం రిఫర్ చేస్తున్నట్లు వైద్యులపై ఆరోప ణలు ఉన్నాయి. కాగా, ప్రభుత్వం మారినా శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రి సేవలు మారకపోవడంపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలను నిలదీశారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకోవాలని సూచించారు.


శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి

విజయనగరం పంపిస్తున్నారు..

ఎస్.కోట ఆస్పత్రికి వస్తున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేయకుండానే వారిని విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. అక్కడ కూడా అవసరమైన సౌకర్యాలు లేవని చెప్పి విశాఖపట్టణం కేజీహెచ్‌కు పంపిస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక రోగులు మృతి చెందుతున్నారు. ఎస్.కోట నుంచే నేరుగా కేజీహెచ్‌కు పంపించాలని కోరుతున్నా వైద్యులు పట్టించుకోవడం లేదు.

- రాయవరపు చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు, అలగుబిల్లి (టీడీపీ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి)

ఆలస్యం చేస్తున్నారు

అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్న వారిని ఓపీ తీసుకొని రావాలని వైద్యులు చెబుతున్నారు. ఓపీ వద్ద కనీసం 10 నుంచి 15 నిమిషాలు పడుతుంది. దీంతో రోగికి చికిత్స అందించేందుకు ఆలస్యమవుతుంది. క్యాజువాల్టీలోకి తీసుకొచ్చినా ఓపీ సీటు లేకపోతే వైద్యులు చికిత్స చేయడం లేదు. దీంతో ఒక్కోసారి రోగుల ప్రాణం మీదకు వస్తుంది.

-పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు, శివరామరాజుపేట (మండల వైస్ ఎంపీపీ)

స్కానింగ్ మిషన్ లేదన్నారు..

నేను ఒక రోజు మధ్యాహ్నం ఆసుపత్రికి వెళ్లాను. రోగ నిర్ధారణకు స్కానింగ్ చేయాలని వైద్యులు చెబితే చేయమన్నాను. ఇక్కడ స్కానింగ్ మిషన్ లేదని చెప్పారు. బయట చేయించుకు రమ్మన్నారు. ఈ ఆసుపత్రిలో స్కానింగ్ యంత్రం ఉంది. ఇక్కడ స్కానింగ్ చేసిన తరువాత సక్రమంగా కనిపించకపోతే ప్రైవేటు, లేదా జిల్లా ప్రభుత్వ పెద్దాసుపత్రిలో చేయించుకోమని చెప్పాలి. కానీ, ఆస్పత్రిలో స్కానింగ్ లేదని చెప్పడం ఎంతవరకు సమంజసం.

-బషీర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు

డబ్బులు అడుగుతున్నారు

ఎస్.కోట ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో వేరే ఆసుపత్రులకు రోగులను తరలించేటప్పుడు డబ్బులు అడుగుతున్నారు. ఎందుకని అడిగితే డీజిల్, పెట్రోల్‌కని చెబుతున్నారు. ఇక్కడకు వస్తున్న వారంతా పేదలే. వారు ఎలా డబ్బులు ఇవ్వగలరు. ఇది మంచి పద్ధతి కాదు. దీన్ని చక్కదిద్దాలి.

-సోమేశ్వరరావు, మండల పరిషత్ అధ్యక్షుడు

ఆంధ్ర యూనివర్సిటీలో బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ప్రోగ్రామ్స్ వివరాలు

1. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్
2. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
3. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్

అర్హతలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Mx7wZFHలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in


నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం!

మెల్‌బోర్న్ వేదికగా జరిగే 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ 15వ ఎడిషన్‌కు హీరో రామ్‌చరణ్ అతిథిగా హాజరు కానున్నారు. ఇందులో బహూకరించే సినిమా అవార్డులకు తన స్టార్ పవర్‌ను జోడించడం ఆసక్తికరం. భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్‌గా అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 'మన భారతీయ చిత్రాల్లోని వైవిధ్యాన్ని, గొప్పదనాన్ని అంతర్జాతీయ వేదికగా వేడుక నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ వేడుకలో పాల్గొనే అవకాశం రావడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున నేను ప్రాతినిధ్యం వహించడం ఆనందం కలిగించే అంశం. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖుల్ని, అభిమానుల్ని కలుసుకోవడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నాను' అన్నారు.




ఏజెంట్ జాన్ స్నో



నితిన్, శ్రీలీల జంటగా రూపుదిద్దుకుంటున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇందులో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రను పోషిస్తున్నారు. ఆయన అసలు పేరు జనార్ధన్ సున్నిపెంట అయితే జాన్ స్నో గా మార్చుకోడం ఆసక్తికరం. శుక్రవారం రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. చిత్రంలో ఆయనది కీలకమైన పాత్ర అనీ, వినోదభరితంగా ఉంటుందని దర్శకుడు వెంకీ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదలవుతుంది.

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో చల్లగాలులు పలకరిస్తుంటే కోర్టు కేసులు, పోలీసు విచారణలు, విడాకులు, వివరణల వార్తలతో చిత్రసీమ వేడెక్కింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమలు శుక్రవారం పలు వివాదాలతో వార్తల్లో నిలిచాయి.



వివాదం విచారణ వివరణ

వివాదం

రూ. పాతిక కోట్లకు పరువునష్టం దావా

'కల్కి 2898 ఏడీ' చిత్రానికి వచ్చిన వసూళ్లు అంతా ఫేక్ అనే వ్యాఖ్యలు చేసిన బాలీవుడ్ సినీ విమర్శకులు సుమిత్ కడేల్, రోహిత్ జైశ్వాల్‌పై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేసింది.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' చిత్రం బాక్సాఫీసు దగ్గర సత్తా చాటుతోంది. ఇటీవలే రూ. వెయ్యికోట్ల క్లబ్‌లో చేరినట్లు వైజయంతి మూవీస్ ప్రకటించింది. అయితే ఇవన్నీ ఫేక్ కలెక్షన్‌లు అని సుమిత్, రోహిత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. రూ. 800 కోట్లు వస్తే, రూ. వెయ్యి కోట్లు అని చెబుతున్నారని విమర్శించారు. దీంతో వైజయంతి మూవీస్ రంగంలోకి దిగింది. 'కలెక్షన్లు ఫేక్ అని మీకు ఎవరు చెప్పారు? మీ దగ్గర ఉన్న ఆధారాలే మీటో చూపించండి, లేదా రూ. 25 కోట్లు చెల్లించండి' అని నోటీసులు పంపింది. గతంలోనూ ఇలాగే సుమిత్, రోహిత్ ప్రభాస్ చిత్రాలను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు.

విడాకులు నిజమేనా?

అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యారాయ్ బచ్చన్ దంపతుల విడాకులు ఖాయమనే ప్రచారం కొన్నాళ్లుగా బాలీవుడ్ సర్కిళ్లలో విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే అభిషేక్‌బచ్చన్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఐశ్వర్య తాముకలిసే ఉన్నామంటూ చెప్పకనే చెప్పారు. అయినా ఆ ప్రచారం మాత్రం ఆగలేదు. ఇటీవలే అనంత్ అంబానీ పెళ్లికి సైతం వీరిద్దరూ విడివిడిగా రావడమే గాకుండా ఫొటోలు సైతం విడిగానే దిగారు. దీంతో మరోసారి వీరి విడాకుల వ్యవహారం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు అభిషేక్‌బచ్చన్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ విడాకుల పోస్ట్‌కు లైక్ కొట్టారు. దీంతో వీరిద్దరూ విడిపోబోతున్నారు కాబట్టే అభిషేక్ ఆ పోస్ట్‌కు లైక్ కొట్టాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రచయిత హీనా ఖండేల్‌వాలా షేర్ చేసిన ఆ పోస్ట్‌లో ఏముందంటే 'కొన్నిసార్లు జీవితం మనం అనుకున్నట్లు సాగదు. విడిపోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. అయినా 50 ఏళ్లు దాటిన వారు కూడా రకరకాల కారణాలతో విడిపోతున్నారు. దశాబ్దాల పాటు కలసి బతికిన వారిని ఇప్పుడు విడిపోవడానికి పురికొల్పుతున్నది ఏమిటి' అనేది ఆ పోస్ట్ సారాంశం.



విచారణకు రాలేను

- రాజ్‌తరుణ్



రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ప్రేమ వ్యవహారం కేసులో విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ నెల 18న విచారణకు హాజరవ్వాలని నార్సింగ్ పోలీసులు రాజ్‌తరుణ్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని, విచారణకు హాజరవ్వలేనని రాజ్‌తరుణ్ పోలీసులకు తన న్యాయవాది ద్వారా వివరణ పంపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు కొత్త సినిమా చిత్రీకరణ, ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండడమే అందుకు కారణమని పేర్కొన్నారు. దీంతో రాజ్‌తరుణ్‌కు మరోసారి నోటీసులు ఇచ్చి, అప్పటికీ విచారణకు హాజరవ్వకపోతే తదుపరి చర్యలు చేపట్టాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

వివరణ

చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి

- బన్నీవాసు

'ఏ కుటుంబంలో అయినా ఒకరు తీసుకున్న నిర్ణయాల వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. ఇలాంటివి మామూలే. వచ్చిపోతుంటాయి. సమయం వచ్చినప్పుడు 'మేం అంతా ఒక్కటే' అని మెగా - అల్లు ఫ్యామిలీ చాటి చెబుతుంది' అన్నారు నిర్మాత బన్నీవాసు. శుక్రవారం ఆయన ఓ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లు అర్జున్ గత ఎన్నికల్లో వైసీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌కు ప్రచారం చేయడం మెగా-అల్లు కుటుంబాల మధ్య విభేదాలకు దారి తీసిందనే ప్రచారం కొన్నాళ్లుగా జరుగుతోంది. ఇదే విషయాన్ని పాత్రికేయులు బన్నీవాస్‌ను అడగ్గా, ఆయన 'అవును' అని గానీ, 'కాదు' అని గానీ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. పాత్రికేయుల ప్రశ్నకు సమాధానమిస్తూ 'అవన్నీ చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి' అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. 'గడ్డు పరిస్థితుల్లో ఆ రెండు కుటుంబాలు ఒకరికి ఒకరు అండగా నిలిచాయి. ఏ కుటుంబంలో అయినా కొన్ని సార్లు చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అంతమాత్రాన వారి అనుబంధం దెబ్బతిన్నట్లు కాదు. వాటినే హైలైట్ చేయడం మంచిది కాదు. నేను 20 ఏళ్లగా మెగా-అల్లు ఫ్యామిలీని చూస్తున్నా. 'కుటుంబ సభ్యులందరూ కలసి ఉండాలని చిరంజీవి గారు ఎప్పుడూ కోరుకుంటారు. ప్రతి సంక్రాంతికి ఆయన కుటుంబ సభ్యులందరినీ తీసుకొని బెంగళూరు వెళ్తారు. మనమందరం ఒకటే అనే భావన కుటుంబ సభ్యుల్లో కలిగించాలనేదే ఆయన ఆలోచన' అని చెప్పారు.

క్షమాపణ

తప్పు చేశా... మన్నించండి

'హీరోయిన్ తమన్నా సాంగ్ ఉంటే చాలు... కథలో పస లేకపోయినా సినిమా హిట్టవుతుంది. ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి అలా తయారైంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో తమిళ నటుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దిగజారుడు వ్యాఖ్యలు చేశారంటూ కోలీవుడ్ చిత్ర పరిశ్రమ ఆయన తీరును తప్పుబట్టింది. దీంతో పార్తీబన్ క్షమాపణలు చెప్పారు. 'చిత్ర పరిశ్రమకు చెందిన అందరినీ నేను గౌరవిస్తాను. నటీనటులను తక్కువ చేసే ఆలోచన నాకు లేదు. నా మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే నన్ను క్షమించండి' అని పార్తీబన్ కోరారు. రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో తమన్నా ప్రత్యేకగీతంలో నర్తించారు. అలాగే ఆమె లీడ్‌రోల్ పోషించిన 'బాక్' చిత్రం కూడా మంచి వసూళ్లను సాధించింది. ఈ నేపథ్యంలో ఆ రెండు సినిమాలను దృష్టిలో ఉంచుకొనే పార్తీబన్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు.



ఆయ్.. అందరినీ ఆకట్టుకుంటుంది



'ఆయ్.. అనే టైటిల్ పెడితే ఒక ప్రాంతానికే పరిమితం అవుతుందా అని అనుకున్నాం. కానీ కథ బాగుంటే అందరూ ఆదరిస్తారనే నమ్మకంతో ఫిక్స్ చేశాం. ఈ కథను ఓకే చేసిన హీరో నితిన్‌కు అభినందనలు. అంతా ఓకే అనుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు ఫోన్ చేశాను. 'ఫస్ట్ డే వరకూ మనం పుష్ చేస్తాం. ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. కథ బాగుందని అంటున్నారు కనుక చేసెయ్యండి' అని ఆయన చెప్పారు. ఈ సినిమాలో వర్షం కోసమే రూ. కోటికి పైగా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే మనం నిజంగానే ఆ ఊళ్లోకి వెళ్లి వర్షంలో తడుస్తున్నట్టుగా అనిపిస్తుంది' అన్నారు అల్లు అరవింద్. ఆయన సమర్పణలో నార్నే నితిన్ హీరోగా బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన 'ఆయ్' చిత్రం థీమ్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడారు. మంచి గోదావరి సినిమా తీశామనీ, స్నేహం గురించి ఇందులో చెప్పామనీ హీరో నార్నే నితిన్ చెప్పారు. ఈ సినిమా చూస్తుంటే నవ్వి నవ్వి బుగ్గలు నొప్పి పెడతాయని బన్నీ వాసు చెప్పారు. గోదావరి ప్రాంతాన్ని బేస్ చేసుకుని తీసిన సినిమాల్లో 'ఆయ్' బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర చెప్పారు.

కొత్త ప్రపంచంలోకి తంగలాన్

తమిళ హీరో విక్రమ్ నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' విడుదల తేదీని ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా చెప్పారు. పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతి తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.



తీర ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

● పర్యాటక అభివృద్ధికి ఊతమివ్వనున్న తీర నియంత్రణ తాజా నోటిఫికేషన్ ● కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్, జూలై 19: సముద్ర తీర ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి, ఈ ప్రాంతంలో ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర నియంత్రణ నోటిఫికేషన్ (సిఆర్‌జెడ్ 2019) దోహదపడుతుందని జేసీ కె.కార్తీక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా నోటిఫికేషన్ మేరకు జిల్లా స్థాయి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాల్సి ఉందని పేర్కొంటూ, ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని దీనిని రూపొందిస్తారని తెలిపారు. ప్లాన్ రూపకల్పన కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తీర నియంత్రణ నోటిఫికేషన్‌పై ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాలను రాష్ట్రస్థాయిలో ఏర్పాటైన పర్యావరణ ప్రభావ అంచనా కమిటీకి నివేదిస్తామన్నారు. 2011 నాటి తీర నియంత్రణ చట్టంతో సరిపోల్చి చూసినట్లయితే 2019 నోటిఫికేషన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు, పర్యాటక వసతులు కల్పించేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం దేశంలో 2011 నాటి సీఆర్‌జెడ్ నిబంధనలే అమలులో ఉన్నాయని, 2019 నోటిఫికేషన్‌కు అందరి ఆమోదం లభిస్తే, ఇది అమల్లోకి వస్తుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధి సుభాని మాట్లాడుతూ తీర నియంత్రణ నోటిషికేషన్-2019 వల్ల వివిధ రకాల అభివృద్ధి పనులకు, పర్యాటక వసతులకు, మత్స్యకారులకు లభించే వెసులుబాట్లను వివరించారు. తీర నియంత్రణ చట్టంలో భాగంగా 50 మీటర్ల లోపు, 100 మీటర్లలోపు, 200 మీటర్లలోపు అనుసరించే కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన పలు మత్స్యకార ప్రజా ప్రతినిధులు తీర నియంత్రణ చట్టంపై తమ అభిప్రాయాలను తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధిచేసిన తర్వాత మాత్రమే సముద్రంలోకి విడిచిపెట్టేలా నియంత్రణ చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలిని వారు కోరారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీరు సరిత, మత్స్యకార ప్రతినిధులు బర్రి చిన్నప్పన్న, మైలపల్లి సింహాచలం, తాత, అప్పలసూర్యనారాయణ, నూకరాజు, పతివాడ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డేని నిర్వహించి సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని కలిసి వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ విజయనాద్ పాల్గొన్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

రాజాం రూరల్: ఈనెల 20న జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాసంఘం చైర్మన్, సీనియర్ న్యాయాధికారి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలియజేశారు. మోటారు వాహనాల చట్టం, నియమ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, ర్యాగింగ్ -దుష్ఫలితాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్టు న్యాయాధికారి ఆనంద్ శ్రీనివాస్ ప్రకటనలో వివరించారు.

25న సోమరాజుపేటలో గ్రామసందర్శన

రేగిడి: ఈ నెల 25న మండలంలోని సోమరాజుపేటలో గ్రామసందర్శన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్యామలా కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 సాయంత్రం 5 వరకు నిర్వహించనున్న గ్రామ సందర్శనలో అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

రామభద్రపురం: గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరని స్థానిక రేణు గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబూటర్ శాంతకుమారి తెలిపారు. నూతన కూటమి ప్రభుత్వం 3 సిలెండర్లు ఇవ్వనున్న నేపథ్యంలో ప్రతి గ్యాస్ కస్టమర్ ఈ నిబంధన తెలుసుకుని, వీలైనంత త్వరగా ఈకేవైసీ పూర్తిచేయించుకోవాలన్నారు.

సీపీఆర్ విధానంపై అవగాహన

విజయనగరం దాసన్నపేట: నగర శివార్లలోని ఆర్‌కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ వరలక్ష్మీ ఉపాధి శిక్షణ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి, కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, సురేష్, సీపీఆర్ విధానంపై ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సంస్థ ఇన్‌ఛార్జి కెవీ రమణ మాట్లాడుతూ పాముకాటు, కరెంటు షాక్, భయం లాంటి కారణాలు కూడా కార్డియాక్‌కు దారితీస్తాయని, ఆటువంటి సమయంలో సీపీఆర్ ప్రాథమిక చికిత్సతో ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధి సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం పాట వాయిదా

కొత్తవలస: కొత్తవలస వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకునేందుకు శుక్రవారం జరగాల్సిన వేలం పాటను వాయిదా వేసినట్టు ఎంపీడీవో రమణయ్య తెలిపారు. భారీ వర్షాల కారణంగా వేలం పాటను వాయిదా వేస్తున్నామని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస: వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీలో సిబ్బందికి, ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించి పలు అంశాలపై వివరించారు. జ్వరాలపై ఇంటింటి సర్వే చేయాలన్నారు. ● వర్షాల కారణంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వీఆర్వోలు తమ గ్రామాల పరిధిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

లక్కవరపుకోట: భారీ వర్షాల కారణంగా మండల స్థాయి అధికారులంతా అందుబాటులో ఉండాలని ఎంపీడీవో కే.రూపేష్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్, మెడికల్ ఆఫీసర్, ఈవోపీఆర్‌డీలతో సమావేశమయ్యారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

దస్తావేజుల రుసుం చెల్లించాలి

రామభద్రపురం: గ్రామపంచాయతీలకు గత కొన్నేళ్ల నుంచి దస్తావేజుల రుసుం చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాయని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మజ్జి రాంబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆ నిధులను తక్షణమే పంచాయతీలకు జమ చేయాలని కోరారు. గత ప్రభుత్వం మళ్లించిన ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేయాలన్నారు. మూడేళ్లుగా చిన్న చిన్న గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని, కనీసం సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయభాస్కరరావు, ఆరికతోట సర్పంచ్ ప్రతినిధి పెంకి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

పంట కాలువలన్నిటినీ శుభ్రం చేయాలి

బొబ్బిలి: వర్షాల నేపథ్యంలో పంటకాలువలన్నీ వరదనీటి ప్రవాహంలో నష్టపోకుండా వాటిని క్లియర్‌గా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పంటకాలువలను భ్రష్టుపట్టించారని ఆరోపించారు. నీటి వనరుల నిర్వహణ ఊసెత్తకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా అవసరమైన నిధులను మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన కాలువలను బాగు చేయించాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

రాజాం: పొగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మత్తులు, చెట్లు కొట్టించడం వంటి కారణాలు వలన ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పొగిరి బొడ్డవలస గ్రామాలతో పాటు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈవిషయం ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వైసీపీ హయాంలో అన్న క్యాంటీన్ల విధ్వంసం

● కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, జూలై 19: అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం విధ్వంసం చేసిందని, ఈ నేపథ్యంలో నిరుపేదలు, వృత్తిదారులు, రైతు కూలీలు ఇలా చాలా వర్గాలకు పట్టెడన్నం దూరమైందని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 15 నుంచి పునఃప్రారంభిస్తున్న అన్న క్యాంటీన్లకు సంబంధించి తన వంతు విరాళంగా రూ.10 వేల చెక్కును కలెక్టర్ అంబేద్కర్‌కి అశోక్ గజపతిరాజు తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమిళనాడులో జయలలిత ఏర్పాటు చేసిన అమ్మ క్యాంటీన్లను తరువాత అధికారంలోకి వచ్చిన స్టాలిన్ ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటైన అన్న క్యాంటీన్లకు ఎంతో ప్రజాదరణ లభించిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై ఉక్కుపాదం మోపి, విధ్వంసం చేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పునర్విభజన పేరిట విజయనగరంలో ఐదు పాఠశాలలను ఎత్తేశారన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకి ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో 23 పాఠశాలలు ఎత్తేశారని రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారన్నారు. తిరిగి ఈ పాఠశాలలను తెరిపించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని చెప్పానన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని, దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.

ఆక్రమణలు పరిశీలించిన ఆర్డీవో

● సమాచారం ఇవ్వకపోవడంపై ప్రజాప్రతినిధుల అసంతృప్తి



ముషిడిపల్లి జగన్నాథచెరువులో వేసిన రోడ్డు చూస్తున్న ఆర్డీవో సూర్యకళ

శృంగవరపుకోట రూరల్, జూలై 19: గత ప్రభుత్వంలోని నాయకులు ముషిడిపల్లి పంచాయతీలో ఉన్న చెరువులు, డీపట్టా భూములను కబ్జాచేసి రోడ్లు వేశారని, డీపట్టా భూములు సైతం ఆక్రమించారన్న ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆర్డీవో సూర్యకళ శుక్రవారం గ్రామానికి వచ్చి, చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, ఉపసర్పంచ్ మేడపురెడ్డి గణేష్, పంచాయతీ పాలకవర్గం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడం, రెండురోజుల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలోనూ ఈ తతంగంపై వాదన జరగడం వంటి అంశాలతో పాటు వీటిపై పత్రికల్లో వరుస కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం మధ్యాహ్నం ముషిడిపల్లి పంచాయతీకి వచ్చిన ఆర్డీవో ఆక్రమణ జరిగిన చెరువు ప్రాంతంతో పాటు డీపట్టా భూములు పరిశీలించారు. అయితే ఆర్‌డీవో పర్యటన విషయంపై రెవెన్యూ సిబ్బంది గోప్యత పాటించడంతో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. తహసీల్దార్ తమకు కనీస సమాచారం అందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఫిర్యాదుదారులమైన తమను పిలిస్తే పూర్తిస్థాయిలో ఆక్రమణలు చూపించేవారమని, ఆర్డీవో కేవలం జగన్నాథచెరువులో 11 సెంట్ల ఆక్రమణ చూసి కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని చెప్పడం తమకు సమంజసంగా అనిపించడం లేదన్నారు. దీనిపై తహసీల్దార్ కిరణ్‌కుమార్ వివరణ కోరగా ఆర్‌డీవో వచ్చారని, చెరువులో వేసిన రోడ్డు చూశారని, కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాక తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

24 సంవత్సరాలైనా రైతులకు డబ్బులు చెల్లించరా?

● వెంగళరాయసాగర్ కాలువకు భూమిలిచ్చిన రైతుల ఆవేదన

● చింతాడలో రైతులతో సమావేశం నిర్వహించిన స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్



రైతుల వాదనలను రికార్డు చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ

బొబ్బిలి, జూలై 19: బొబ్బిలి మండలం చింతాడ గ్రామంలో వెంగళరాయ సాగర్ అదనపు ఆయకట్టు పథకం పనులకు సేకరించిన భూముల రైతులతో శుక్ర వారం సమావేశం నిర్వహించారు. చింతాడ సచివాలయంలో బొబ్బిలి భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకుని వాటిని నమోదు చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, న్యాయవాది తమ్మిరెడ్డి దామోదరరావు, గ్రామసర్పంచ్ బంకురు తిరుపతిరావు తదితర రైతులు తమ వాదనను వినిపించారు. గ్రామానికి చెందిన 35 మంది రైతుల నుంచి 10 ఎకరాల భూములను వెంగళరాయసాగర్ కాలువ నిర్మాణార్థం 24 సంవత్సరాల క్రితం భూసేకరణకు ఇచ్చారని, ఇంతవరకు దానికి అతీగతీ లేకుండా పోయిందన్నారు. వాస్తవానికి అప్పటి రైతులు చాలా మంది చనిపోగా, మరికొంతమంది తమ భూములను అమ్ముకున్నారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్ల తరువాత అది రద్దవుతుందని, మళ్లీ తాజాగా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఎకరా ధర లక్ష రూపాయలేనని, పక్కనే తోటపల్లి కాలువల కోసం ఇచ్చిన భూముల ధరలు 20, 30 రెట్లు అధికంగా ఉన్నాయని రైతుల వాదన. తాజాగా నోటిఫికేషన్ ఇచ్చి కొత్త భూసేకరణ ధరలను తమకు చెల్లించాలని రైతులంతా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే కాలువ పథకాన్ని రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేయడంతో ఈ వాదనలన్నీ కలెక్టర్ సమక్షంలో వినిపించాలని ప్రమీలా గాంధీ రైతులకు సూచించారు. తన పరంగా నివేదికను సమర్పిస్తానని ఆమె తెలిపారు. ఆర్‌ఐ కల్యాణచక్రవర్తి, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా రాజ్యలక్ష్మి




ప్రొఫెసర్ జయలక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి శుక్రవారం వీసీ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యూనివర్సిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. యూనివర్సిటీలో ఎటువంటి సమస్యలు ఉన్నా.తన దృష్టికి తీసు కువస్తే.. పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, వివిధ విభాగాల డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు వద్ద ఘాట్ నిర్మాణం

విజయనగరం రూరల్, జూలై 19: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరుల తల్లి పైడిమాంబ వనంగుడి వెనుక భాగాన ఉన్న పెద్ద చెరువు వద్ద ఘాట్ నిర్మాణానికి నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించే సందర్భంలో ఆ ప్రాంతమంతా బురదగా మారుతోంది. ఈ క్రమంలో పైడిమాంబ దేవస్థానం ఈఓ డీవీ ప్రసాదరావు నగర పాలక సంస్థ అధికారులకు ఈ విషయమై లేఖ రాశారు. చదురుగుడి మెట్ల ముందు కాలువ ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. ఎత్తు పెంచకపోవడం వల్ల నీరు నిల్వ ఉండడం.. పూడిక పేరుకుపోవడంతో వర్షాకాలంలో కాలువ నీరు బయటకు వస్తోంది. ఈ విషయమై శుక్రవారం నగర పాలక సంస్థ అధికారులు వచ్చి ఆలయం ముందు ఉన్న కాలువను పరిశీలించారు. అంచనాలు తయారు చేసి, ఈ కాలువ, రైల్వే స్టేషన్ వెనుక ఉన్న పెద్దచెరువు వద్ద ఘాట్ నిర్మాణం అక్టోబరులోగా పూర్తి చేయాని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

పైడిమాంబ ఆలయంలో చండీహోమం



చండీ హోమంలో భక్తులు

నగరంలోని మూడు లాంతర్లు రోడ్డులో ఉన్న పైడిమాంబ ఆలయం వద్ద శుక్రవారం చండీహోమాన్ని నిర్వహించారు. ఈఓ డి.ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, దేవస్థానం ఉద్యోగులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు.


వివేకానందుని సందేశాలు స్ఫూర్తిదాయకం



విగ్రహావిష్కరణలో పాల్గొన్న బేబీనాయన, మాజీ ఎమ్మెల్సీ మాధవ్

బొబ్బిలి, జూలై 19: భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచస్థాయిలో చాటిచెప్పిన మహనీయుడు స్వామివివేకానందుని జీవిత విశేషాలను ప్రతి పౌరుడు ఔపోసన పట్టి ఆయన స్ఫూర్తితో యువత పనిచేయాలని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. స్థానిక గొల్లవీధిలో సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉద్యోగి నక్కాన మాదవరావు సొంత నిధులతో నిర్మించిన 14 అడుగుల స్వామివివేకానంద విగ్రహాన్ని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్‌తో కలిసి ఎమ్మెల్యే బేబీనాయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ యువకుడైన మాధవ్ ఇదే స్ఫూర్తితో తమ వార్డులో వివేకానందుని విగ్రహాన్ని తన స్వార్జితంతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బొబ్బిలిలో గల గ్రంథాలయానికి స్వామి వివేకానందుని పేరు పెట్టాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నట్లు బేబీనాయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ గొలగాని రమాదేవి, జనసేన నేత పెద్దింటి మనోజ్‌కుమార్, బీసపు పార్వతీచిన్నారావు, భాను తదితరులు పాల్గొన్నారు.

పన్నుల లక్ష్యాలను సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లక్ష్యాలను సాధించాలని కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో శుక్రవారం ఆమె సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. పన్నుల ప్రక్రియపై సమీక్షించారు. ప్రగతి చూపించలేని సెక్రటరీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి పి.ప్రసాదరావు, ఆర్‌ఐ త్రినాధరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తాం: డీఈవో

రాజాం: జిల్లాలో గల అన్ని కేజీబీవీలలోనూ గెస్ట్ ఫ్యాకల్టీని నియమించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా సమగ్రశిక్ష అధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో 'కేజీబీవీల్లో బోధన మెరుగయ్యేనా' అనే శీర్షికతో వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రా కపోవడంతో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించలేదన్నారు. జిల్లాలోని 26 కేజీబీవీల్లో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 13 పీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

కొండ దిగితేనే వైద్యం

● మైదాన ప్రాంతంలోనే వైద్యసిబ్బంది సేవలు

● ఆర్ఎంపీలే గిరిజనులకు దిక్కు

శృంగవరపుకోట రూరల్: గిరిశిఖర ప్రాంతాల్లోని గిరిజనులకు జబ్బు చేస్తే వారు కచ్చితంగా మైదాన ప్రాంతానికి వస్తేనే వైద్యం అందుతుంది. వీరు ప్రతి శుక్రవారం కొండ దిగి వైద్యసేవలు పొందడం పరిపాటిగా మారింది. ఈ సమీప ప్రాంతాల్లో వైద్యసేవలపై శుక్రవారం పరిశీలించగా.. దారపర్తి గిరిజనులు పదుల కిలోమీటర్లు కొండ దిగి ఆర్ఎంపీల వద్ద వైద్యసేవలు పొందుతున్నారు. కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది ప్రతి శుక్రవారం గిరిజనుల కోసం ఇక్కడే కాపుకాసి వారికి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ విషయంపై గిరిజన యువత మట్లాడుతూ దారపర్తి పంచాయతీలో 14గ్రామాల ప్రజలకు దిగువ స్థాయి సిబ్బంది వచ్చి మందు బిళ్లలు ఇచ్చి వెళ్తారని.. ఇంజక్షన్ కావాలంటే ఆర్ఎంపీలు చేస్తారన్నారు. గిరిశిఖర గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.



దబ్బగుంట వద్ద ఆర్ఎంపీతో వైద్యసేవలు పొందుతున్న గిరిజనులు

జగన్ భూదోపిడీకి అంతేలేదు



సమావేశంలో మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట, జూలై 19: వైసీపీ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భూదోపిడీ గత అయిదేళ్లలో రూ.35 వేల 576 కోట్లని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఆమె నియోజకవర్గ నేతలతో కలిసి ఎల్.కోటలో గల తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క భూమినీ వదలకుండా జగన్ లాక్కున్నాడని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశాడని మండిపడ్డారు. విశాఖలో జగన్ భూదందాకు అడ్డులేకుండా పోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల విలువైన భూములను కబ్జా చేశాడని విమర్శించారు. ఇటువంటి వ్యక్తికి ఏ శిక్ష వేయాలో న్యాయమూర్తులకే అర్థం కాలేదన్నారు. డబ్బులు పంచుతున్నాడనే సందడిలో ప్రజలు జగన్ మాయను చూడలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, కొల్లు రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, కోళ్ల శ్రీను, కొట్యాడ ఈశ్వరరావు, ఎర్నయుడు, తిక్కాన చినదేముడు, లాలం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో మరొకరు మృతి

● మూడుకు చేరిన మృతుల సంఖ్య

మెంటాడ: మండలంలోని రాబంధ, మీసాలపేట గ్రామాల మధ్య ఈనెల 15న ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య మూడుకి పెరిగింది. దత్తిరాజేరు మండలం గదబవలసకు చెందిన కెల్ల సామమ్మ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, విజయనగరం కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17 న కోరాడ రాములప్పమ్మ మృతిచెందింది. కాగా, విశాఖ జి.జి.హెచ్‌లో చికిత్స పొందుతున్న అట్టాడ అప్పల కొండమ్మ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. దీంతో గదబవలస గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శాకంబరిగా అమ్మవారు



కొత్తవలసలో అమ్మవారు

కొత్తవలస: కొత్తవలస జంక్షన్‌లో నున్న దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూలతో విశేషంగా అలంకరించారు.

జామి: జామిలో ఉన్న కనకదుర్గమ్మను శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భగవాన్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

సొంత ఇంటి కల నెరవేరుతుంది: కోండ్రు

రాజాం: చంద్రబాబునాయుడు పాలనలో పేదల సొంతింటి కల సాకారమయ్యే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంచరాం సమీపంలో అప్పట్లో టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లు నిర్మించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వాటిని వదిలేసిందని అన్నారు. చంద్రబాబు నాయుడుకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో రాష్ట్రంలో మొత్తం నిర్మాణాలను నిలుపుదల చేసి దుర్మార్గానికి ఒడిగట్టాడని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, పేద లబ్ధిదారులకు త్వరలో అందజేస్తామని సీఎం హామీ ఇచ్చారని కోండ్రు తెలిపారు.

జేఎన్‌టీయూ పరిధిలో స్కౌట్స్ అండ్ గైడ్స్

విజయనగరం రూరల్, జూలై 19: హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజగిరి హరివిఠల్, రాష్ట్ర కార్యదర్శి దుంపల వెంకటప్పలనాయుడు, అసోసియేషన్ ద్వారా కళాశాలల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమకి వివరించి అనుమతి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు గొల్లపూడి పృథ్వీరాజ్, గుడివాడ కళ్యాణి, జీవీ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏవీ పాపారావు, పీడీ నాగరాజు, స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

కొత్తవలస, జూలై 19 : మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తో పాటు పలువురు శాసన సభ్యులు హాజరు కావలసి ఉండగా వర్షం కారణంగా రాకపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అప్పటికే కొంతమంది దివ్యాంగులు వివిధ ప్రాంతాల నుంచి రావడంతో చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఆందోళన

బొబ్బిలి: స్థానిక కోరాడవీధి శ్రీరామనగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం షార్టుసర్క్యూట్‌తో ఒక్కసారి పెద్ద శబ్దాలతో విద్యుత్ కాంతులు రావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక అందరూ ఉలిక్కిపడ్డారని ఏఎంసీ డైరెక్టర్ సాధిక్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బేబీనాయన

తెర్లాం: మండలంలోని విజయరాంపురం, పనుకువలస, డి.గదబవలస గ్రామలలో ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబాలను ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం పరామర్శించారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంక టనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, మండల నాయకులు రమేష్, సర్పంచ్ రమేష్, బూరి శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీసీ అప్పారావు మనవారే



చిప్పాడ అప్పారావు

రేగిడి: తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతిగా నియమితులైన ఆచార్య చిప్పాడ అప్పారావు రేగిడి మండలం వారే. ఆయన సరసనాపల్లిలో జన్మించారు. ఎస్వీయూలో డీన్‌గా, బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనకు అరుదైన అవకాశం లభించింది. అప్పారావు సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎస్వీయూ ఇన్‌చార్జ్ ఉపకులపతిగా నియమించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన తండ్రి అప్పలస్వామి పొందూరు ఎంఈవోగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆయన తల్లి సీతమ్మ గృహిణి.

కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలి

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో కోర్టు భవనాల సముదాయానికి నిధులు మంజూరు చేయించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయనను)ను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహనమురళీకుమార్, కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. నూతన భవనాల సముదాయం నిర్మించేందుకు అవసరమైన రూ.32 కోట్లు విడుదల చేయించాలని కోరారు. న్యాయవాదులు కండాపు ప్రసాదరావు, అమరాపు రామకృష్ణ, చల్లారపు సత్యనారాయణ, జాగారపు శ్రీనివాసరావు, మత్స ఆనంద్‌కుమార్, మంతిన సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

విజయనగరం క్రైం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విజయనగరం వన్‌టౌన్ సీఐ వెంకటరావు సూచించారు. శుక్రవారం సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నిబంధనలు సత్ప్రవర్తన, మత్తుపదార్థాలతో జరిగే అనర్థాలపై శ్రీనివాసా కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం, అక్రమ రవాణాతో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో ఉద్యోగాలకు అనర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ హరిబాబు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల లక్ష్యాలను పూర్తి చేయాలి

రాజాం: ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయించాలని ఆదేశించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ముసురేసింది

- ఎడతెరిపిలేని వానతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- మరింత అధ్వానంగా మారిన రహదారులు
- పాఠశాలల ఆవరణలో చేరిన వర్షపునీరు

జిల్లాలో గత మూడు రోజుల నుంచి అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపి లేని వాన కురుస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పాఠశాలల ఆవరణలో నీరు చేరింది. రహదారుల్లోని గోతుల్లో నీరు చేరి, మరింత అధ్వానంగా తయారయ్యాయి. పొలాల్లోనూ, చెరువుల్లోనూ నీరు చేరడంతో రైతన్నలు సాగుకు సన్నద్ధం అవుతున్నారు.



భోగాపురం: రహదారి గోతుల్లో చేరిన వర్షపునీరు



రేగిడి: సంకిలి వద్ద పాలకొండ-రాజాం రోడ్డు పరిస్థితి

రహదారులు ఛిద్రం

భోగాపురం: అసలే అధ్వాన రహదారులు.. ఆపై వర్షా కాలం.. ఇక ప్రయాణికుల పాట్లు చెప్పనవసరం లేదు. ఇదీ భోగాపురం మండలంలోని గ్రామీణ రహదారుల పరిస్థితి. రెడ్డికంచేరు నుంచి బమ్మిడిపేట మీదుగా ముంజేరు వైపు వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డు నామరూపాలు లేకుండా పోయింది. అలాగే రెడ్డికంచేరు నుంచి



డీఎఫ్ఎన్ రహదారి దుస్థితి

వైఎం పాలెం మీదుగా ముక్కాం వెళ్లే రహదారి దారుణంగా తయ్యారయ్యింది. దారి పొడవునా గోతులే. ఈ గోతుల్లో చేరిన వర్షపునీటితో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ● **రేగిడి:** రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ రహదారులు భారీగా దెబ్బతిన్నాయి. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న పాలకొండ-రాజాం రహదారి తో పాటు గ్రామాలను కలిపే పంచాయతీరాజ్‌లో ఉన్న రహదారులు పూర్తిగా పాడయ్యాయి. ఈ రహదార్లపై ప్రయాణాలు స్థానికులకు నరకం తలపిస్తోంది. కొత్త ప్రభుత్వంలోనైనా ఈరోడ్ల తక్షణ మరమ్మతులకు చొరవచూపాలని స్థానికులు కోరుతున్నారు. ● **బొబ్బిలి:** గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన రహదారులు నేడు వాహనదారులకు, బాటసారులకు నరకయాతనకు గురిచేస్తున్నాయి. బొబ్బిలి పట్టణంలో కాలేజీ రోడ్డు దగ్గర నుంచి తెర్లాం- పిరిడి, బలిజిపేటకు వెళ్లే అనేక రహదారులు నాశనం అయ్యాయి. తెర్లాం రహదారి సైతం గుంతలు, గోతులతో అధ్వాన్నంగా తయారయ్యింది. ● **గరివిడి:** పట్టణానికి ఆనుకుని డీఎఫ్ఎన్ ప్రధాన రహదారి అధ్వానంగా తయారయ్యింది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రహదారి మధ్యలో గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉంటోంది.



బొబ్బిలి: పిరిడి జంక్షన్‌లో చిక్కుకుపోయిన వాహనాలు



రాజాం రూరల్: ఉబాలకు పొలం సిద్ధం చేస్తున్న దృశ్యం



డెంకాడ: వర్షాలకు మునిగిన వరి ఎదలు

పొలాల్లో చేరిన నీరు

రాజాం రూరల్: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు చేరడంతో పాటు చెరువుల్లో కూడా నీరు చేరడంతో రైతన్నలు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దాదాపుగా మండలం అంతటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ● **శృంగవరపుకోట:** వర్షాలకు మండలంలో వరి నాట్లు వేస్తున్నారు. చెరువుల్లో అక్కడక్కడ నీరు చేరింది. పొలాల్లోనూ వర్షపు నీరు కనిపిస్తుంది. ● **డెంకాడ:** ఎడ తెరపి లేని వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పొలాల్లో నీరు చేరి, వరి ఎదలకు నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మడ్డువలసకు జలకళ

వంగర: ఎగువ ప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వేగావతి, సువర్ణముఖి నదుల్లో జల ప్రవాహం పెరిగింది. దీంతో మడ్డువలసలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయానికి 63.52 మీటర్లు ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 64 మీటర్లుకు చేరింది. రెండు నదుల ద్వారా ఇన్‌ఫ్లో 700 క్యూసెక్కులు మడ్డువలస రిజర్వాయర్‌కు వచ్చి చేరుతుండటంతో రాత్రి సమయానికి పూర్తిస్థాయి నీటి మట్టం నమోదు చేయవచ్చునని అధికారులు అంచనాలు వేసున్నారు. ప్రోజెక్టులో నీరు పెరిగితే ప్రధాన గేట్లు తెరిచి నీరు దిగువకు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రాజెక్టు ఏఈ నితిన్ తెలిపారు.

63.8 వర్షపాతం..

విజయనగరం రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో విజయనగరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 63.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జూలై నెలలో సాధారణ వర్షపాతం 185 మిల్లీమీటర్లు కాగా, ఈనెల 19 నాటికి కేవలం 70.4 మిల్లీమీటర్లు వర్షపాతం మాత్రమే నమోదు అయ్యింది.

పంచాయతీ కార్యాలయంలో చదువులు

మెంటాడ: గురమ్మవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందికి వాన కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పాఠశాల కొన్నేళ్ల కిందటే శిథిలావస్థకు చేరుకుంది. గోడలు బీటలు వారి, శ్లాబు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో ఈ పాఠశాలను కొన్ని రోజులు పంచాయతీ కార్యాలయంలోనూ, కొన్నిరోజులు శివాలయంలోనూ నిర్వహించేవారు. ప్రస్తుతం వర్షాల కారణంగా శ్లాబు నుంచి నీరు కారడంతో స్థానిక పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు. రెడ్డివానివలస పాఠశాల పరిస్థితి దాదాపు ఇంతే.



పంచాయతీ కార్యాలయంలో తరగతులు



పాఠశాల భవనంలో నీరు కారుతున్న దృశ్యం

పాఠశాల మైదానంలో వర్షపు నీరు

శృంగవరపుకోట: రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వర్షపు నీరు నిలిచింది. **భోగాపురం:** ఎడతెరిపి లేని వాన కారణంగా భోగాపురం ఉన్నత పాఠశాల ఆవరణ నీటితో నిండిపోయింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు.

వెళ్లేందుకు దారి లేక..

భోగాపురం: రహదారి పక్కన ఉన్న కాలువలు ఆక్రమణలకు గురి కావడంతో వర్షపునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోతోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పెట్రోల్ బంకు నిర్వాహకులు పంట కాలువను వారికి అనుకూలంగా పూడ్చేసి, కింద పైపులు ఏర్పాటు చేయడంతో నీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడింది.



రహదారి పక్కనే నిల్వ ఉన్న వర్షపునీరు

శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ..



పాఠశాల ఆవరణలో చేరిన నీరు

గుర్ల: అసలే శిథిలమైన పాఠశాల భవనం.. ఆపై ఎడతెరిపి లేని వర్షం.. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు. ఇదీ గుర్ల మండలంలోని శేషపుపేట గ్రామంలోగల ప్రాథమిక పాఠశాల పరిస్థితి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా శేషపుపేట పాఠశాల ఆవరణలోకి వర్షపునీరు చేరింది. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో శ్లాబు నుంచి నీరు కారుతోంది. తరగతి గదుల్లోకి నీరు చేరింది. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాల పై నుంచే విద్యుత్ హెచ్‌టీ వైర్లు వెళ్తున్నాయి. ఈ వైర్లను తొలగించమని పలుమార్లు దరఖాస్తులు చేసినా ఫలితం మాత్రం శూన్యం.



నీరుచేరిన తరగతి గదిలోనే విద్యార్థులు

ఎన్‌సీసీకి చీపురుపల్లి కళాశాల ఎంపిక

చీపురుపల్లి: ఎన్‌సీసీ యూనిట్ స్థాపన కోసం చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్‌సీసీ అధికారి శ్యామలరావు తదితరులు శుక్రవారం కళాశాలను పరిశీలించారని చెప్పారు. కళాశాల క్రీడా మైదానం, విద్యార్థుల సంఖ్యను వారు ఆరా తీశారన్నారు. ఎన్‌సీసీ కోర్సు శిక్షకుడిగా హిందీ అధ్యాపకుడు సతీష్ పేరును ప్రతిపాదించామని ఆయన తెలిపారు. ఎంపికైన వెంటనే ఈ కళాశాలలో ఎన్‌సీసీ కోర్సు అందుబాటులోకి వస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

చీపురుపల్లి: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు రాజకీయాల్లో జనసేన పార్టీ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యావంతులు, యువత పార్టీలోకి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి జనసైనికులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమయ పాలన పాటించాలి

నెల్లిమర్ల: నెల్లిమర్ల సీహెచ్‌సీ వైద్యులు సమయ పాలన పాటించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, పలువురు కౌన్సిలర్లు ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీని వారు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులందరికీ శత శాతం వైద్య సదుపాయాలు అందాలన్నారు. ఇకపై ఆసుపత్రి సిబ్బందిపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వినోద్‌కి సూచించారు. లేదంటే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, మజ్జి ఆదినారాయణ, ముడిమంచి లక్ష్మణరావు, బయిరెడ్డి కళ్యాణ్, జనసేన నాయకులు, రవ్వా నాగేంద్రవర్మ, బంగారు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు'

డెంకాడ: జనసేన, టీడీపీ నాయకుల మధ్య ఎలాంటి విబేధాలు లేవని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం డెంకాడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎక్కడా టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఎలాంటి విబేధాలు లేవని తెలిపారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ నాయకుల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ నాయకులు పన్నిన పన్నాగమని ఎద్దేవా చేశారు. రెండు పార్టీల నాయకులు ప్రజా శ్రేయస్సుకు అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు.

చంద్రబాబును కలిసిన కళా

గరివిడి: ముఖ్యమంత్రి చంద్రబాబును చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు విజయవాడలోని ఆయన స్వగృహంలో శుక్రవారం కలిశారు. చీపురుపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.



నేడు మండల సర్వసభ్య సమావేశం

పూసపాటిరేగ: మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలి మండల సర్వసభ్య సమావేశం జరగటంతో ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

సెంచూరియన్‌లో బూట్ క్యాంప్ ప్రారంభం

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన బూట్ క్యాంప్‌ను వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పారిశ్రామిక ప్రోజక్టులకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపనున్నారు. వాటిలో చంద్రయాన్, రోబోటిక్స్ అప్లికేషన్లు, వీఎల్ఎస్ఐ చిప్ ఫ్యాబ్రికేషన్ తదితర ప్రోజెక్టును చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి, డీన్ సన్నిడియోల్, ఐక్యూ ఏసీ డీన్ పీఎస్‌వీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.



సహస్ర దీపాలంకరణ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కనకదుర్గమ్మకు ఆషాఢ మాసం సారె

భోగాపురం: భోగాపురం కనకదుర్గమ్మ అమ్మవారికి బొల్లు వీధికి చెందిన భక్తులు శుక్రవారం ఆషాఢమాసం సారె సమర్పించారు. రకరకాల పిండివంటలు, పండ్లతో అమ్మవారి వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి సారె సమర్పించి, విశేష పూజలు నిర్వహించారు.



కనకదుర్గమ్మకు సారె తీసుకెళ్తున్న భక్తులు

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- ఎమ్మెల్యే నాగమాధవి
- నిండుగా సర్వసభ్య సమావేశం

డెంకాడ: ప్రతిఒక్కరూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొదటిసారిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ రావుతో పాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పూర్తిస్థాయిలో హాజరు కావడంతో సభ నిండుగా కనిపించింది. ఈ సమావేశంలో ముందుగా తాగు నీటి సమస్యపై ఆ శాఖ ఏఈ మాట్లాడుతూ, గ్రామాల్లో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేశామని చెప్పారు. మండల కేంద్రంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ట్యాంకుల్లో క్లోరినేషన్ లేకపోవడం గ్రామంలో ప్రజలకు వ్యాధులు సంభవిస్తున్నాయని ఎంపీటీసీ కోరాడ కుమారి సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కొన్ని గ్రామాల్లో కొళాయిల నుంచి నీరు వస్తున్నప్పటికీ తాగేందుకు ఉపయోగపడడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని, గ్రామంలో కొద్ది కాలంలోనే సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో తాగునీటి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, క్లోరైడ్ పరీక్షలు కూడా చేయాలని అక్కివరం ఎంపీటీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఏవో పూడి నిర్మల తమ నివేదిక వివరిస్తూ వరి విత్తనాలు, ఎరువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్టాకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌శాఖ ఏఈ స్వామి మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలు పూర్తి స్థాయిలో తీర్చేందుకు తన సాయశక్తులా ప్రయత్నిస్తున్నానని, సభ దృష్టికి తీసుకువచ్చారు. మోదవలస ఎంపీటీసీ సభ్యురాలు బోని యువ శ్వేత మాట్లాడుతూ, గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ గొండయపాలెంలో 24 గంటల విద్యుత్ సరఫరా లేదని సభలో తెలిపారు. చింతలవలస భూ సమస్యలపై వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మినాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి దారి పరిష్కారం చూపాలని కోరారు. అలాగే కొన్ని శాఖల్లోను సమస్యలపై సభ దృష్టిలో పెట్టడం వాటి పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో తృప్తి చెందారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ కలెక్టర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన గ్రామదర్శిని కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ కూరాకుల అనిత, ఎంపీడీవో లవ్‌రాజు, తహసీల్దార్ రామారావు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పురపాలక సంఘ కార్యాలయము : : బొబ్బిలి

రేఖానెం. 03/2019/ఏ2, **వేలం ప్రకటన** తేది: 19.07.2024దీ.

2024-2025 ఆర్థిక సంవత్సరము నందు ఈ పురపాలక సంఘమునకు సంబంధించి నాలుగు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగానున్న షాపు రూములు లీజుకు ఇచ్చుటకు తే. 26.07.2024దీ శుక్రవారం ఉదయం గం॥11.00లకు ఈ పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. కావున సదరు బహిరంగ వేలములోని పాల్గొనదలచిన వారు లీజు నోటిఫికేషన్ గజిట్ నెం. 72/2024/ఏ8, తే. 10.07.2024దీ లోని మరియు ఈ దిగువ తెలిపిన షరతులకు లోబడి వేలం పాట నందు పాల్గొనవలెను. పాటలోని పాల్గొనదలచిన వారు ప్రస్తుత ఆర్థిక సం.,రము నందు సాల్వెన్సీ మరియు ఇ.సి. పాటకు ముందుగా సంబంధిత అధికారులచే జారీచేయబడినవి మాత్రమే అనుమతించబడును. అటుల చేయని వారు వేలంపాటలో పాల్గొనుటకు అనర్హులు మరియు ఇందువిషయమై ఇదివరలో గుత్తలు సక్రమంగా చెల్లించకుండా బకాయిలు ఉన్నవారు మరియు వారి కుటుంబసభ్యులు వేలం నందు పాల్గొనుటకు అనర్హులు. ఇందు విషయమై ఇంకను వివరములు పొందగోరు వారు ఈ పురపాలక సంఘ కార్యాలయము పనిచేయు వేళలో రెవెన్యూ అధికారి/రెవెన్యూ విభాగము వారిని సంప్రదించి పాటలో పాల్గొనగలరు.

క్ర.సం	మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పేరు	గుడ్‌విల్ మొత్తము	కాల పరిమితి	నెలసరి అద్దె	చెల్లించవలసిన దరావత్తు సొమ్ము రూ॥	3నెలలు అద్దె అడ్వాన్సు దరావత్తు మరియు జి.ఎస్.టి	సాల్వెన్సీ మరియు ఇ.సి.వివరాలు
1	2	3	4	5	6	7	8
1.	మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ 16(గౌండు ఫ్లోరు) ఎస్.సి. కేటగిరి, షాపు నెం.17 ఫస్ట్‌ఫ్లోరు (నాయిబ్రాహ్మిన్), షాపు నెం.22 ఫస్ట్‌ఫ్లోరు (ఎస్.సి.మాలా), షాపు నెం.25 ఫస్ట్‌ఫ్లోరు (ఎస్.టి. జనరల్), షాపు నెం.27 ఫస్ట్‌ఫ్లోరు (ఎస్.సి. జనరల్), షాపు నెం.31 ఫస్ట్‌ఫ్లోరు (బి.హెచ్.సి), షాపు నెం.33 ఫస్ట్‌ఫ్లోరు (ఎస్.టి. జనరల్) (7 షాపులు మాత్రమే)	రూ॥ 1,00,000/-లు	లీజుకి ఇచ్చిన తేదీ నుండి 5 సం॥లు	రూ॥ 9500/-లు	రూ॥ 50,000/-లు	నిర్ణయించిన అద్దె 3 నెలలు	రూ॥ 3,60,000/-లు విలువ గల సాల్వెన్సీ మరియు ఇ.సి ప్రస్తుతం జారీ చేసిందే ఉండవలెను.
2.	మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.18, 19, 26, 28, 29, 30 మరియు 34 (మొదటి అంతస్తు) (7 షాపులు మాత్రమే)	రూ॥ 1,00,000/-లు	లీజుకి ఇచ్చిన తేదీ నుండి 5 సం॥లు	రూ॥ 9500/-లు	రూ॥ 50,000/-లు	నిర్ణయించిన అద్దె 3 నెలలు	రూ॥ 3,60,000/-లు విలువ గల సాల్వెన్సీ మరియు ఇ.సి ప్రస్తుతం జారీ చేసిందే ఉండవలెను.
3.	మేదరబంద షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం. 23, 27, 28, 29, 30, 32 (మొదటి అంతస్తు) (6 షాపులు మాత్రమే)	రూ॥ 25,000/-లు	లీజుకి ఇచ్చిన తేదీ నుండి 5 సం॥లు	రూ॥ 5350/-లు	రూ॥ 15,000/-లు	నిర్ణయించిన అద్దె 3 నెలలు	రూ॥ 2,50,000/-లు విలువ గల సాల్వెన్సీ మరియు ఇ.సి ప్రస్తుతం జారీ చేసిందే ఉండవలెను.
4.	మేదరబంద షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం. 17 (మొదటి అంతస్తు) నాయి బ్రాహ్మిన్‌లకు కేటాయించబడినది) (ఒక షాపులు మాత్రమే)	రూ॥ 25,000/-లు	లీజుకి ఇచ్చిన తేదీ నుండి 5 సం॥లు	రూ॥ 5350/-లు	రూ॥ 15,000/-లు	నిర్ణయించిన అద్దె 3 నెలలు	రూ॥ 2,50,000/-లు విలువ గల సాల్వెన్సీ మరియు ఇ.సి ప్రస్తుతం జారీ చేసిందే ఉండవలెను.
5.	వెలిగాని సీతాయమ్మ షాపింగ్ కాంప్లెక్స్, షాపు నెం. 26, 38, 51 (3 షాపులు మాత్రమే)	రూ॥ 15,000/-లు	లీజుకి ఇచ్చిన తేదీ నుండి 5 సం॥లు	రూ॥ 2550/-లు	రూ॥ 10,000/-లు	నిర్ణయించిన అద్దె 3 నెలలు	రూ॥ 1,00,000/-లు విలువ గల సాల్వెన్సీ మరియు ఇ.సి ప్రస్తుతం జారీ చేసిందే ఉండవలెను.

పై తెలిపిన షాపు రూములలో రిజర్వేషన్‌లో కేటాయించిన షాపులు నెలసరి అద్దెలో 50 శాతం రాయితీ ఇవ్వబడునని తెలియజేయడమైనది.

సం/- ఎల్. రామలక్ష్మి,
కమీషనరు, బొబ్బిలి పురపాలక సంఘం

గనిబంటాలో నీరు తొలగింపుపై ఆందోళన

గరివిడి: డీఎఫ్ఎన్ ప్రాంతంలోగల గనిబంటాలో నీరు తొలగింపుపై దువ్వాం, కొండపాలెం పంచాయతీ పరిధిలోగల డీఎఫ్ఎన్ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బంటానీరు తొలగించడం వల్ల భూగర్భ జలాలు తరిగిపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బంటాలో నీరు తొలగించి భూగర్భ ఖనిజ నిక్షేపాలను తవ్వుకునేందుకు సంబంధిత యాజమాన్యం ప్రయత్నించడం వల్ల ఆ ప్రాంతవాసులు మండి పడుతున్నారు. యాజమాన్య ప్రతినిధి భరత్‌రెడ్డికి విన్నవించినా నీరు నిరాటంకంగా తొలగిస్తున్నారని గ్రామానికి చెందిన కె.సాయి సుందరరావు, టి.సూరిబాబు తదితరులు విమర్శించారు. మైనింగ్ కోసం నీరు లేకుండా చేయవద్దని డీఎఫ్ఎన్ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బంటా నీరు తొలగింపును అడ్డుకోవాలని వారు విన్నవించారు.

అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం రూరల్: వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

త్రోబాల్ పోటీలకు ఎంపిక

గుర్ల: చింతలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మజ్జి యమున జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యింది. ఈ విషయాన్ని పాఠశాల పీఈటీ లక్ష్మణ శుక్రవారం తెలిపారు. ఈనెల 13న విజయవాడలో జరిగిన సౌత్‌జోన్ సీనియర్ నేషనల్స్ ఆంధ్రప్రదేశ్ త్రోబాల్ మహిళల జట్టు ఎంపికలో యమున పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబరిచిందని చెప్పారు. దీంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యిందని తెలిపారు. వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో కర్ణాటక రాజధాని బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ మేరకు బాలికను పాఠశాల హెచ్ఎం గౌరీదేవి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

రేపు గురు పూర్ణిమ ఉత్సవాలు

చీపురుపల్లి: పట్టణంలోని షిరిడీ సాయి ఆలయంలో ఆదివారం గురు పూర్ణిమ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తంగుడు రామకృష్ణ, అర్చకులు రవిశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పూజా కార్యక్రమాలతో పాటు అన్న ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

చీపురుపల్లి: ఈనెల 21న గురు పౌర్ణమి సందర్భంగా చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారు శాకంబరి దేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి అలంకరణ కోసం కూరగాయలు అందజేయాలనుకున్న వారు ఈ నెల 20న ఉదయాన్నే ఆలయం వద్దకు పంపించాలని ఆయన కోరారు.